స్కెచ్

# స్నేహితం

ఆర్. యం. చిదంబరం

ఉన్న శక్తిని కాస్తా ఆఫీసులోని టైపు యంత్రం లాక్కొని వదలింది. రోడ్డంట వస్తూంటే ఏ గోడమీద చూచినా క్రొత్తసినిమా వాలుపోస్టరులు. ఆనాడే దిగింది కొత్త సినిమా. ఆఖరికి "నోటీసులు అంటించకూడదు. అంటించినవారు శిక్షింపబడుదురు" అన్న కొన్ని గోడలమీది హెచ్చరికలను కూడా లెఖ్ఖచేయకుండా సినిమా వాలుపోస్టరులు అంటించి పారేశారు. పోనీ, కాస్త ఆ సినిమా చూచి అయినా నాబాధలను మరచి ఉండగలనేమో ననుకుని ఇంటికివెళ్ళి సినిమాకు తయారయ్యాను. మరి సినిమా రిక్ట్రియేషన్ ఇచ్చేది గదండీ అట్టి సదవకాశాన్ని వదలుకోవటం మెలాగ? భార్యతోసహా సినిమాహాలులో హాజరయ్యాను.

ఎవరో హాలులో నాపేరుతో పిలవటం విని వెనక్కి తిరిగి చూచాను. ఇంకేముంది నా ప్రియమిత్రుడు శేఖర్ కూడా వచ్చాడు, 'హల్లో' అంటే 'హల్లో' అనుకున్నాం.

"ఏమోయ్! ఎప్పుడువచ్చావు?" అన్నాను.

"పొద్దున్న వచ్చాను. వస్తున్నట్లు నీకు ఉత్తరం రాశాను. నువ్వు స్టేషనుకు వస్తావనుకున్నాను. కాని రాలేదు.నీఇల్లు వెతుక్కుంటూ పట్టణమంతా గాలించాను. కాని కనుక్కోలేక పోయాను. ప్రియస్నేహితులకు చూపవలసిన మర్యాదేనా యిది" అన్నాడు.

"ఉత్తరం రాశావా? అరెరె....నాకు అందలేదే! ఏమే! మనింటికి ఈవేళ ఏమైనా ఉత్తరాలు వచ్చాయా?" అని భార్యను ప్రశ్నించాను.

"లేదండీ" అన్నది.

కొంపతీసి "నిన్న వచ్చింది గదండి. మీరూ చూశారుగా" అనంటుందేమోనని నా గుండె ఢక్కఢక్క మని కొట్టుకుంటోనే ఉంది. అసలు వాడి ఉత్తరం అందినమాట నిజం. రేషను కాలంలో వాడికి తిండి పెట్టడమెలాగ అని ఊరుకున్నాను. వాడు వస్తే కనీసం దివసత్రయమన్నా ఇంటిదగ్గర తిష్ఠవేస్తాడు. అది వాడి సంప్రదాయం. అందుకని వాడిని స్టేషనుకు ఆహ్వానించటానికి వెళ్ళకుండా చల్లగా ఊరుకున్నాను. కాని వాడు మాత్రం నన్ను పట్టేశాడు. ఇక గత్యంతరం లేదు.

"ఎలాగయినా నువ్వు కన్పించావు. అదే చాలు. ఇవేళ మీ యింట్లోనే మకాం" అన్నాడు.

"ఎంతమాట! నువ్వు రాకపోయినా నిన్ను బలవంతంగా మా యింటికి కట్టితీసుకెడతాను. తెలుసా?" అన్నాను. "అసలు నువ్వెందుకు వచ్చావురా బాబూ!" అనుకున్నాను లోపల.

నాకు సినిమామీద దృష్టిలేదు. రేపువీడికి వండి పెట్టడానికి గింజలు ఎక్కడనుండి తేవటమా అన్న ఆలోచనలో మునిగిపోయాను. మొన్ననే కోమటి "బియ్యం అయిపోయాయి, ఇంక రావద్దు"అని ఖచ్చితంగా చెప్పేశాడు. హోటల్లోభోజనం పెట్టిస్తే "వీడి స్నేహం ఇంతేనా? హోటల్లో భోంచేయమంటాడా" అనుకుంటాడు. సినిమా ముగిశాక ముగ్గురం ఇల్లు చేరుకున్నాం.

మర్నాడు మరో కోమటిని పట్టుకుని బియ్యం సంపాదించాను. మూడు రోజులవరకు శేఖర్ మా యింట్లోనే ఉన్నాడు.

శేఖర్ అలవాటు ప్రకారం మూడు రోజులకే తిరుగు ముఖం పట్టలేదు. ఈసారి వారం రోజులు మా యింట్లో తిష్ఠవేశాడు. ఇంకవాడి నెలగయినా పంపటానికి మార్గం ఆలోచించవలసి వచ్చింది.

ఇక మర్యాదను పక్కకుపెట్టి వాడిని ఖచ్చితంగా "ఏం పనుండి వచ్చినట్లు"అనడిగేశాను.

ఈ మాటకు వాడు కొద్దిగా బాధపడ్డట్టు వాడి ముఖం సూచించింది.

"ఏంలేదోయ్! ఊరికే నీబోటి స్నేహితుల్ని చూచిపోదామని వచ్చాను" అన్నాడు.

నేనేమీ అనలేకపోయాను. అంతకన్నా "నీబోటి వాళ్ళను ఏడిపిద్దామని వచ్చాను" అంటే బాగుండేదేమో!

ఎలాగయితేనేం, నేనుఅప్పుడప్పుడు బియ్యం లేదన్నందుకు నా భార్యమీద ఎగిరినందుకు, ఇంకా అప్పుడప్పుడు పరోక్షంగా అన్నమాటలకు వాడు తట్టుకోలేక ఇంటికి వెళ్ళిపోతానని బెడ్డింగు రెడీ చేసుకుని తయారయ్యాడు. నేను భగవంతుడికి కృతజ్ఞతాభి వందనాలర్పించాను.

వాడు రైలుకు వెళ్ళిపోయాడు. నేనురాత్రి భోంచేసి పేపరు చదువుతూంటే వాడు తిరిగి వచ్చాడు. నేను ఆశ్చర్యపోయి "ఏమోయ్! తిరిగి వచ్చేశావే?" అన్నాను.

"డీసెల్ అందలేదోయ్. రేపు ప్రొద్దున తొమ్మిదింటికివెడతాను" అన్నాడు. ప్రయాణం అష్టే వాయిదా పడనందుకు ఆనందించాను.

వాడు మరునాడు ప్రొద్దున ఏడింటికి ఎక్కడికో వెళ్ళి పదింటికి తిరిగివచ్చి "ఈ పాటికి మా ఊరు పోయేబండి వెళ్ళిపోయుంటుం దను కుంటా" అన్నాడు. నేను సమాధానం చెప్పలేకపోయాను.

సాయంత్రం బయలుదేరుతూ వాడు 'బ్రదర్ ఒక పదిరూపాయ లీయవోయ్. అత్యవసరం. మళ్ళీ నీ ఋణం తీర్చుకుంటా' అన్నాడు. ఈ ఋణం తీర్చుకొంటా ననేది పరిపాటయిపోయింది. నేను సరేనని వాడికి పది రూపాయలిచ్చివాడు మళ్ళీ తిరిగి వస్తాడేమోనని కూడా వెళ్ళి రైలెక్కించి పంపివచ్చాను.

తరువాత రెండు మూడు నెలలకు నేను వాడి ఊరు వెళ్ళినప్పుడు దురదృష్టం కొలదీ పర్సుపారేసుకున్నాను. శేఖర్ గాడినికలుసుకొని రైలు ఛార్జీకైనా ఒక రూపాయిమ్మ నడిగాను.

వాడు "తెస్తాను. ఉండు" అని అదే పోవటం పోయాడు. ఎంతకీ రాకపోయేసరికి వాడి ఇంటికి వెడితే వాడక్కడ లేడు. అతని భార్యామణి "అప్పుడే ఎవరినో స్నేహితుడిని చూడాలని బస్సెక్కి వెళ్ళారు" అంది.

"శేఖర్ కి ఏమీ ఉద్యోగం దొరకలేదాండి?" అన్నాను.

"లేదండి" అన్నదామె.

"ఈ స్నేహితులను చూచే ఉద్యోగముండగా మరొక టెందుకు. ఓ ప్రియ స్నేహితుడా! ఆనాటి ఋణాన్ని అద్భుతంగా తీర్చుకున్నావోయ్!" అనుకుని ఓ పెద్ద మనిషిదగ్గర రూపాయ పుచ్చుకుని మా ఊరు చేరుకున్నాను.

కథానిక

# అర్థంకాని శశి

ఇచ్ఛాపురపు జగన్నాథరావు

మూడేళ్ళ క్రిందట—

కృష్ణమూర్తి ఇంటికి వెళ్ళినప్పుడు ఏదో పిచ్చాపాటీ మాటలాడుకుంటూంటే శశి వివాహ ప్రస్తావన వచ్చింది.

శశి అంటే శేఖరం చెల్లెలు. చాలా అందమైనదీ, తెలివైనదీను. స్కూల్ ఫైనల్ ప్యాసయింది. శేఖరం నాకెంత సన్నిహితుడో ఆమె కూడా అంత చనువుగాఉండేది నాతో. ఆధునిక సంస్కారం గల శేఖరమూ, వాళ్ళ తల్లిదండ్రులూ ఆమెకి అడ్డుచెప్పరు ఏ విషయంలోనూ. సినీమాకి వెళ్ళాలంటే "నాన్నా, సినీమాకి వెళ్ళొద్దూ?" అని అడుగుతుంది. "వెళ్ళమ్మా. నీకు అభ్యంతరం ఏముందీ?" అన్న సమాధానం తప్పదు. ఏ సినీమాకో, ఎవరితోనో, ఆయన పట్టించుకోడు. శేఖరమూ, తల్లీ సరేసరి. కాని, వివాహవిషయంలో శశి పూర్ణస్వాతంత్ర్యం ఈయబడడమూ, ఆమె ఆ నిర్ణయాధికారాన్ని తండ్రికి తిరిగి వప్పచెప్ప